
సాక్షి
బాపట్ల
మంగళవారం, 24, జూన్, 2025



వేంకటేశ్వరునికి సహస్ర ఫలార్చన

వినుకొండ: శ్రీనివాసనగర్‌లో పద్మావతి సమేత వేంటేశ్వరస్వామి దేవాలయంలో సోమవారం జేష్ఠ త్రయోదశి కృత్తికా నక్షత్రం పవిత్రదినం సందర్భంగా సహస్రఫల పదార్చన నిర్వహించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 514.30 అడుగుల వద్ద ఉంది. ఇది 139.0872 టీఎంసీలకు సమానం.



అమ్మ వారి హుండీ కానుకల లెక్కింపు

దుగ్గిరాల: కంఠంరాజు కొండూరులోని మహంకాళీ అమ్మవారి హుండీ కానుకలు సోమవారం లెక్కించారు. మొత్తం రూ. 20,67,441 ఆదాయం వచ్చినట్టు అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

కాలువల మరమ్మతులకు చర్యలు తీసుకోండి



లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): జిల్లాలో సాగు నీటి కాలువలు మురుగునీటి మయమై ప్రజారోగ్యానికి ముప్పుగా మారాయని, వెంటనే మరమ్మతులు చేపట్టాలని రాష్ట్ర రైతు సంఘ ప్రధాన కార్యదర్శి కె.వి.వి ప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు పీజీఆర్ఎస్‌లో కలెక్టర్‌కు సోమవారం వినతిపత్రం సమర్పించారు. పశ్చిమ కృష్ణా డెల్టా ఆయకట్టు సుమారు 5.71 లక్షల ఎకరాల్లో విస్తరించి ఉందని తెలిపారు. కాలువలు సక్రమంగా లేకపోవడంతో ఆయకట్టు రైతులంతా అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణికి సాగునీటి కాలువల పరిస్థితి నిదర్శనమని విమర్శించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి జమలయ్య, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కొల్లి రంగారెడ్డి, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పి.వి.జగన్నాథం, అధ్యక్షులు కంజుల విఠల్‌రెడ్డి, నాయకులు పాపారావు, రైతులు పాల్గొన్నారు.

హైవేలపై ప్రమాదాల నివారణకు ఆధునిక వాహనాలు

ఆర్టీఓ బి.సత్యనారాయణ ప్రసాద్



పట్నంబజారు (గుంటూరు ఈస్ట్): జాతీయ రహదారులపై ప్రమాదాలను నివారించడానికి కేంద్ర ప్రభుత్వం ఆధునిక వాహనాలను ప్రవేశపెట్టినట్లు ఆర్టీఓ బి.సత్యనారాయణ ప్రసాద్ తెలిపారు. గుంటూరులోని కార్యాలయంలో సోమవారం నంది ఇన్వెస్టిగేషన్ సెక్యూరిటీ సర్వీసెస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నాలుగు పెట్రోలింగ్ ఆధునిక వాహనాలను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగా ఏర్పాటు చేసిన ఈ వాహనాలు 5, 9 నంబర్ల జాతీయ రహదారులపై నిత్యం అందుబాటులో ఉంటాయని చెప్పారు. నంది ఇన్వెస్టిగేషన్ సెక్యూరిటీ సర్వీసెస్ ఎండీ, విశ్రాంత అడిషనల్ ఎస్పీ కాళహస్తి సత్యనారాయణ పాల్గొన్నారు.

శంకర్ విలాస్ బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభం



నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): శంకర్ విలాస్ బ్రిడ్జి నిర్మాణ పనులు సోమవారం ప్రారంభమయ్యాయి. ముందుగా బ్రిడ్జి మీదకు బస్సులు, లారీలు, ఇతర భారీ వాహనాలు రాకుండా డైవర్ట్ చేశారు. కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలను మాత్రమే అనుమతించారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా లాడ్జి సెంటర్ వద్ద, డొంక రోడ్డు నుంచి కొత్తపేట వైపు వెళ్లేటప్పుడు మలుపుల వద్ద డివైడర్లు ఏర్పాటు చేశారు.

నాట్యంపై రాత పరీక్షలు ప్రారంభం



కూచిపూడి(మొవ్వ): పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పరిధిలోని శ్రీ సిద్ధేంద్ర యోగి కూచిపూడి కళాపీఠంలో మూడు రోజుల పాటు సాగే కూచిపూడి నాట్య సర్టిఫికెట్, డిప్లమో రాత పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షలకు పరిశీలకులుగా హైదరాబాద్ సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ డి. వెంకట సత్యనారాయణ, ఇన్విజిలేటర్లుగా పసుమర్తి హరినాధశాస్త్రి, ఏలేశ్వరపు శ్రీనివాసులు వ్యవహరిస్తున్నారు. తొలి రోజు పరీక్షకు 37 మంది విద్యార్థులకు 31 మంది హాజరయ్యారని ఎగ్జామినేషన్ చీఫ్ సూపరింటెండెంట్ డాక్టర్ చింతా రవి బాలకృష్ణ తెలిపారు.

వంచనపై గర్జించిన యువత



యువత పోరుకు విశేష స్పందన

- బాపట్లలో నిరుద్యోగుల భారీ ప్రదర్శన
- జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన యువత
- అడుగడుగునా పోలీసుల ఆంక్షలు
- కలెక్టరేట్ ఎదుట బైఠాయింపు
- ప్రభుత్వ తీరును ఎండగడుతూ నినాదాలు
- హోరెత్తిన కలెక్టర్ ప్రాంగణం
- యువతకు అండగా వైఎస్సార్ సీపీ యువజన విభాగం

"మేము అధికారంలోకి రాగానే జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తాం..ఉద్యోగాలు ఇస్తాం... ఉద్యోగం ఇవ్వలేకపోతే నిరుద్యోగ భృతి నెలకు రూ.మూడు వేలు ఇస్తాం" అంటూ కూటమి నేతలు ఊరువాడా ఊదరగొట్టారు. తీరా అధికారంలోకి వచ్చాక నిరుద్యోగులను వంచించారు. కూటమి ప్రభుత్వ వంచనపై యువత పోరుబాట పట్టింది. వైఎస్సార్ సీపీ యువజన విభాగం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌ల వద్ద ఆందోళనకు దిగారు. పోలీసులు అడుగడుగునా ఆటంకాలు కల్పించినా లెక్క చేయక ముందుకు సాగారు. ప్రభుత్వ తీరును ఎండగట్టారు.



ద్విచక్రవాహనాలపై ప్రదర్శనగా వస్తున్న నాయకులు

బాపట్ల: కూటమి ప్రభుత్వం నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ యువజన విభాగం ఆధ్వర్యంలో సోమవారం చేపట్టిన యువత పోరుకు జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి యువత పెద్ద ఎత్తున తరలివచ్చింది. బాపట్ల పట్టణంలో కదం తొక్కారు. కలెక్టరేట్‌కు వెళ్లే రహదారులన్నీ యువతతో కిక్కిరిసిపోయాయి. పోలీసులు అడుగడుగునా ఆటంకాలు కల్పించినప్పటికీ యువత, నిరుద్యోగులు, విద్యార్థులు, పార్టీ నాయకులు ముందుకు కదిలారు. ప్రదర్శన స్థానిక రథం బజారులోని పార్టీ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు సాగింది. యువజన విభాగం జిల్లా అధ్యక్షులు కొక్కిలిగడ్డ చెంచయ్య నాయకత్వంలో వహించారు. ఈ కార్యక్రమాన్ని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు మేరుగ నాగార్జున, బాపట్ల, రేపల్లె, వేమూరు నియోజకవర్గాల సమన్వయకర్తలు కోన రఘుపతి, వరికూటి అశోక్‌బాబు, ఈవూరి గణేష్ ప్రారంభించారు. యువత సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్‌గౌడ్‌కు వినతి పత్రం ఇచ్చారు. వినతి పత్రం ఇచ్చేందుకు కూడా అనుమతి ఇవ్వకపోవటంతో ఎట్టకేలకు పదిమంది నాయకులు లోనికి వెళ్లి డీఆర్‌ఓకు సమస్యలతో కూడిన వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు కాగిత సుధీర్‌బాబు, కోకి రాఘవరెడ్డి, రాష్ట్ర జనరల్ సెక్రటరీ నక్కా వీరారెడ్డి, సెక్రటరీ దొంతిబోయిన జయభరత్‌రెడ్డి, చేజర్ల నారాయణరెడ్డి, జిల్లా అధికారప్రతినిధి వీరేంద్ర, జిల్లా ఉపాధ్యక్షులు ప్రసాదరెడ్డి, శంకర్‌రెడ్డి, దొంతిబోయిన సీతారామిరెడ్డి, షేక్ సయ్యద్ పీర్, శాయిల మురళి, చల్లా రామయ్య, నియోజకవర్గ అధ్యక్షులు దొంతిబోయిన ఏడుకొండలరెడ్డి, మధు, యువజన విభాగం మండల, పట్టణ అధ్యక్షులు ఊరబండి గోపీనాథ్, రవితేజ, సాగర్, షేక్ మౌలాలి, గోపి, నాయకులు వడ్డిముక్కల డేవిడ్, మహ్మద్ హుస్సేన్, జోగిరాజా, నర్రావుల వెంకట్రావు, మోర్ల సముద్రాల గౌడ్, గంగిశెట్టి రత్తయ్య, ఎంపీపీ చిన్నపోతుల హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపక్షాల గొంతు నొక్కేప్రయత్నం మానుకోవాలి

ప్రతిపక్షాల గొంతు నొక్కే ప్రయత్నాలు కూటమి ప్రభుత్వం మానుకోవాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు మేరుగ నాగార్జున అన్నారు. నేడు యువత ఉద్యోగాలు లేక అల్లాడుతుంటే ఇచ్చిన వాగ్దానాలను పెడచెవిన పెట్టి ప్రభుత్వం కాలక్షేపం చేస్తుందన్నారు. యువతను మోసం చేసిన చంద్రబాబునాయుడు రైతులకు కూడా గిట్టుబాటు ధర కల్పించకుండా ఘోరంగా మోసం చేశాడని విమర్శించారు.

ఎన్నికల మేనిఫెస్టోపై నిలదీస్తాం

ఎన్నికల మేనిఫెస్టోపై ప్రతిపక్షంగా మేము నిలదీస్తామని బాపట్ల నియోజకవర్గ సమన్వయకర్త కోన రఘుపతి పేర్కొన్నారు. ఎన్నికల ముందుకు ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీల్లో ఒక్కటి కూడా అమలు చేయలేదన్నారు. 50 సంవత్సరాలకే బీసీలకు పెన్షన్ ఇస్తామని చెప్పిన చంద్రబాబునాయుడు ఉన్న పెన్షన్లు తొలగించేందుకు కంకణం కట్టుకున్నారని విమర్శించారు. స్థానిక నాయకులు సముద్రాన్ని సైతం కబ్జా చేస్తుంటే అధికారులు మౌనంగా ఉండిపోతున్నారని అన్నారు.

వైఫల్యాలను ఎండగడతాం

విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకపోవటంతో కళాశాలల యాజమాన్యం హాల్ టికెట్లు ఇవ్వడం లేదని రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త ఈవూరి గణేష్ పేర్కొన్నారు. రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న మెడికల్ కళాశాలలను సైతం పట్టించుకోకపోవటంతో అవి శిథిలావస్థకు చేరుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంతో మందికి వైద్య పరంగా అవకాశాలను కల్పించే మెడికల్ కళాశాలలను పట్టించుకోకపోవటం చూస్తుంటే పేదోడికి వైద్యం అక్కరలేదన్నట్లు ఉందన్నారు. ప్రభుత్వ వైఫలాలను ఎండగట్టాల్సిన పరిస్థితి నెలకొందన్నారు.

అసాంఘిక కార్యక్రమాలకు అనుమతులు

కూటమి ప్రభుత్వం చేపట్టే కోడిపందెలు, పేకాట స్థావరాలకు అనుమతులు ఉంటాయి గానీ, శాంతియుతంగా యువత, నిరుద్యోగులు తమ సమస్యలు చెప్పుకునేందుకు అనుమతులు ఇవ్వకపోవటం బాధాకరమని పార్టీ వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు అన్నారు. పోలీసులు తమ తీరును మార్చుకోవాలన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలపై గ్రామస్థాయి నుంచి నిలదీసేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు.

ప్రజావ్యతిరేక విధానాలను సహించేదిలేదు

కూటమి ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలను యువత చూస్తూ ఊరుకోదని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షులు కొక్కిలిగడ్డ చెంచయ్య అన్నారు. నిరుద్యోగులు ఉపాధి కోసం ఒక పక్కన ప్రశ్నిస్తుంటే వారిపై అక్రమ కేసులు బనాయించటం సరికాదన్నారు.



కలెక్టరేట్ వద్ద ప్రదర్శనకారులను అడ్డుకుంటున్న పోలీసులు

నిరసనలతో దద్దరిల్లిన కలెక్టరేట్

బాపట్ల: యువత, అంగన్‌వాడీలు, ఇంజినీరింగ్ కార్మికుల ఆందోళనలతో సోమవారం బాపట్ల కలెక్టరేట్ దద్దరిల్లింది. నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని, యువతకు ప్రభుత్వం కల్పిస్తామని చెప్పిన నిరుద్యోగ భృతి ఇవ్వాలని, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పథకాలు సక్రమంగా అమలు చేయాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ యువజన విభాగం ఆధ్వర్యంలో నిరుద్యోగులు, విద్యార్థులు ఆందోళనకు దిగారు. కలెక్టరేట్ ప్రాంతమంతా జనసంద్రంగా మారిపోయింది. తమకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని కోరుతూ అంగన్‌వాడీ కార్యకర్తలతోపాటు మున్సిపల్ కాంట్రాక్టు ఇంజినీరింగ్ విభాగం కార్మికులు ధర్నాలు చేపట్టారు. పోలీసులు అనుమతులు ఇవ్వకపోవటంతో ప్లై ఓవర్ వద్దనే నిరసనలు తెలియజేశారు. కలెక్టరేట్ వద్ద భారీగా పోలీసులు మోహరించారు. దీంతో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీలు ఇచ్చేందుకు వచ్చిన వారు సైతం ఇబ్బందులకు గురయ్యారు.

ఉద్యోగాల కల్పన ఏదీ?

వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మేరుగ చంద్‌నాగ్ మాట్లాడుతూ ఎన్నికలకు ముందుకు చంద్రబాబునాయుడు యువతకు ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా అమలుకు నోచుకోలేదన్నారు. లక్షలాది మంది యువత ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారని అన్నారు. కొత్త ఉద్యోగాలు ఇవ్వకపోగా వివిధ సాకులు చూపి చిరుద్యోగులను తొలగిస్తున్నారని విమర్శించారు. నిరుద్యోగ భృతి నెలకు రూ.3వేలు ఇస్తామని ప్రకటించిన ప్రభుత్వం ఏడాది గడిచినా దాని ఊసెత్తడం లేదని అన్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే వారిపై కేసులు మోపి జైళ్లకు పంపుతున్నారని విమర్శించారు.



డీఆర్‌ఓ గంగాధర్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు



మాట్లాడుతున్న కోన రఘుపతి, పక్కన మేరుగ నాగార్జున, గణేష్, అశోక్‌బాబు



మాట్లాడుతున్న యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు చంద్‌నాగ్

గంగపుత్రులపై కేసులు దుర్మార్గం

- కబ్జాదారుడు వెంకటరావుపై చర్యలు తీసుకోవాలి
- లేకపోతే పోరాటం చేస్తాం
- ఏపీ మత్స్యకార, మత్స్యకార్మిక సంఘం డిమాండ్



ఆక్రమణపై కరపత్రాలు ఆవిష్కరిస్తున్న మత్స్యకార్మిక సాధన సమితి నాయకులు

చీరాల టౌన్: ప్రకృతి వనరులు దోచుకోవడంతో పాటుగా అధికారమే శాశ్వతం అనుకుని అక్రమాలు చేయడంతోపాటు బీచ్‌నే కబ్జా చేసి మత్స్యకారుల జీవనానికి అడ్డుగా నిలిచి సీ మౌత్‌ను మూసేసిన బుర్ల వెంకటరావుపై చర్యలు తీసుకోకుంటే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని ఏపీ మత్స్యకార, మత్స్యకార్మిక సంఘం నేతలు డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని విజయలక్ష్మీపురంలోని మత్స్యకారులకు సీపీఎం నాయకులు సంఘీభావం ప్రకటించారు. మత్స్యకార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొల్లాటి శ్రీనివాసరావు మాట్లాడుతూ రియల్ ఎస్టేట్ వ్యాపారి బుర్ల వెంకటరావు అధికార పార్టీ ఎమ్మెల్యేల అండతో సముద్రాన్ని కబ్జా చేయడం దారుణమన్నారు. చీరాల, బాపట్ల నియోజకవర్గాల పరిధిలోని 12 మత్స్యకార గ్రామాల ప్రజలు, మెకనైజ్డ్ బోట్లు, 2 వేల మోటార్ బోట్లుతో 14వేల మంది మత్స్యకారులు సముద్రంలో వేట చేస్తున్నారని, వేట అనంతరం బోట్లు, పడవలను ఈపురుపాలెం స్ట్రయిట్‌కట్ ప్రాంతంలో నిలుపుదల చేస్తున్నారు. సీఆర్‌జెడ్ పరిధి దాటి సీ మౌత్‌ను మూసేసి, ఇరిగేషన్ భూమిని ఆక్రమించి మత్స్యకారులు వేటకు వెళ్లకుండా అడ్డుకోవడం దుర్మార్గమన్నారు. గంగపుత్రులను సామాజికంగా, ఆర్థికంగా నష్టపరుస్తున్న బుర్ల వెంకటరావుపై కఠిన చర్యలు తీసుకోకుండా అధికారులు, పోలీసులు రక్షణగా నిలవడం దుర్మార్గమన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆక్రమణలు, కబ్జాలు, ప్రభుత్వ పెద్ద అధికారులు, ప్రజాప్రతినిధుల అండతో ఆన్‌లైన్ చేయించుకున్నారన్నారు. వెంకటరావు ఆగడాలకు అధికారపార్టీ అండగా నిలవడం తగదన్నారు. తమ జీవనానికి ఇబ్బందులు పడుతున్నామని సీమౌత్ మూయవద్దని కోరిన మత్స్యకారులపై కేసులు పెట్టించడం క్షమించరానిదని, మత్స్యకారుల సత్తా ఏంటో చూపుతామని హెచ్చరించారు. మత్స్యకారుల సమస్యల పరిష్కారం, బుర్ల వెంకటరావుపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం బాపట్ల జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్నామని, మత్స్యకారులు అధిక సంఖ్యలో పాల్గొనాలని స్ట్రయిట్ కట్ మొగ పునరుద్ధరణ సాధన సమితి కన్వీనర్ ఎరిపిల్లి రమణ పిలుపునిచ్చారు. చీరాల-బాపట్ల సరిహద్దు ప్రాంతంలోని సమస్యను అధికారులు పరిష్కరించి మత్స్యకారులకు అండగా నిలవకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మత్స్యకారులు, నాయకులు బాబురావు ఉన్నారు.

దుర్గమ్మ హుండీ ఆదాయం రూ.3,70,41,400




భవానీపురం(విజయవాడపశ్చిమ): విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం (దుర్గగుడి)కి హుండీ కానుకల ద్వారా రూ.3,70,41,400 ఆదాయం లభించింది. అలయ ప్రాంగణంలోని మల్లేశ్వర మహామండపం ఆరో అంతస్తులో సోమవారం హుండీ కానుకల లెక్కింపు చేర్పారు. 18 రోజులకు రూ.3,70,41,400 నగదు, 501 గ్రాముల బంగారం, 6,948 గ్రాముల వెండి లభించాయి. కానుకల లెక్కింపు కార్యక్రమాన్ని దేవస్థానం కార్యనిర్వహణాధికారి శీనానాయక్ పర్యవేక్షించగా అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ రంగారావు, దేవదాయ శాఖ సిబ్బంది, వన్‌టౌన్ పోలీసులు, ఎస్‌పీఎఫ్ పోలీసులు పాల్గొన్నారు.

నమ్మించి..నట్టేట ముంచి...

- చేతివాటం ప్రదర్శిస్తున్న పోస్టుమాస్టర్‌లు
- తాజాగా పూనూరు పోస్టుమాస్టర్ లీలలు
- నకిలీ పాస్‌పుస్తకాలతో ఖాతాదారులకు శఠగోపం
- లబోదిబోమంటున్న ఖాతాదారులు
- కొరవడిన ఉన్నతాధికారుల పర్యవేక్షణ



విచారణ చేస్తున్న ఒంగోలు ఏఎస్పీ మధుసూదనరావు



ఖాతాదారులకు ముద్రలు వేసి ఇచ్చిన దొంగ పుస్తకం

యద్దనపూడి: ఆరుగాలం కష్టించి రూపాయి రూపాయి కూడబెట్టుకొని కొందరు.. ప్రతి నెలా వచ్చే సామాజిక పింఛన్‌లో కొంత మిగుల్చుకొని మరికొందరు.. తమ పిల్లల భవిష్యత్ కోసం మరి కొందరు నెలనెలా పోస్టాఫీసులో పొదుపు చేస్తూ వస్తున్నారు. వారికి చేయూత అందించాల్సిన పోస్టుమాస్టర్‌లు చేతివాటాన్ని ప్రదర్శిస్తున్నారు. ఇటీవల కాలంలో ఇలాంటి మోసాలు నియోజకవర్గంలో నాగండ్ల, చెరుకూరు, నాగులపాలెం బ్రాంచ్‌ల్లో వెలుగులోకి రావడం గమనార్హం. తాజాగా యద్దనపూడి మండలం పూనూరు పోస్టాఫీస్‌లో పోస్టుమాస్టర్ నకిలీ పాస్‌పుస్తకాలతో ఖాతాదారులను మోసం చేసిన విషయం వెలుగు చూసింది. పూనూరు పోస్టాఫీసులో కల్యాణ్‌రావు 22 సంవత్సరాలుగా పోస్టుమాస్టర్‌గా పనిచేస్తున్నాడు. పోస్టాఫీస్‌కు వచ్చే వారితో బాగా పరిచయాలు పెంచుకున్నాడు. దీంతో సుమారు 1200కు పైగా ఖాతాదారులు పోస్టుమాస్టర్‌పై నమ్మకంతో నెలనెలా పొదుపు సొమ్ము కడుతూ వస్తున్నారు.

గడువు ముగిసినా నగదు ఇవ్వకపోవడంతో..

గడువు ముగిసినా నగదు ఇవ్వకపోవటంతో కొందరు ఖాతాదారులు చీరాల ఏఎస్పీ శ్రీనివాసరావుకి ఏప్రిల్ నెల15న ఫిర్యాదు చేశారు. 19వ తేదీన తనిఖీకి వచ్చిన శ్రీనివాసరావు విచారణ చేపట్టి జిల్లా ఉన్నతాధికారులకు తప్పుడు నివేదిక ఇచ్చాడు. దీంతో కొందరు ఈ విషయాన్ని విజయవాడలోని పోస్టాఫీస్ ప్రధాన కార్యాలయంలో ఆధారాలతో సహా ఫిర్యాదు చేశారు. పోస్టాఫీస్ విజిలెన్స్ అధికారులు మే 22వ తేదీన పూనూరు పోస్టాఫీస్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీల్లో పోస్టుమాస్టర్ అవినీతి బండారం బట్టబయలైంది. తప్పుడు నివేదిక ఇచ్చిన చీరాల ఏఎస్పీ శ్రీనివాసరావును హిందుపురం బదిలీ చేశారు. పూనూరు పోస్టుమాస్టర్‌ను సస్పెండ్ చేశారు. ప్రస్తుతం విచారణాధికారిగా ఒంగోలు ఏఎస్పీ మధుసూదనరావును వేశారు. కానీ విచారణ మాత్రం నత్తనడకన సాగటంతో ఖాతాదారులు తమ సొమ్ము వస్తుందో రాదోనంటూ భయపడుతున్నారు.

అవకతవకలు వాస్తవమే..

పూనూరు పోస్టాఫీస్‌లో అవకతవకలు జరిగిన మాట వాస్తవమే. 1200 మంది ఖాతాదారులు ఉండగా ఇప్పటి వరకు 50 శాతం పుస్తకాలు పరిశీలించాం. పూర్తిస్థాయి విచారణ ముగియగానే ఆధారాలు ఉన్నవారికి తిరిగి వడ్డీతో సహా నగదు చెల్లిస్తాం. చాలా మంది ఆధారాలు లేకుండా డబ్బు ఇచ్చినట్లు ఫోర్జరీ సంతకాలతో నగదు తీసుకున్నాడని చెప్తున్నారని వారిని కూడా పిలిచి ఒక లిస్టు తయారుచేసి న్యాయం జరిగేలా చూస్తాం.

–సాధిక్, సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీసెస్, ఒంగోలు

ఫోర్జరీ సంతకాలతో నగదు డ్రా చేశాడు..



నా భర్త ఆర్డీ తాలూకు ప్రతినెలా రూ.5000 కడుతుంటాడు. ఆయన అనారోగ్యంగా ఉన్న సమయంలో ఫోర్జరీ సంతకంతో రూ.40 వేలు పోస్టుమాస్టర్ డ్రా చేశాడు. అలాగే ఒక పుస్తకానికి రూ.2500 మాత్రమే కడుతూ మరో పుస్తకానికి 8 నెలల నుంచి నగదు కట్టలేదు. ఇలా ఎంతో మందిని మోసం చేశాడు.

–ఉప్పల శ్రీలక్ష్మి, పూనూరు

నకిలీ పుస్తకం ఇచ్చి మోసం చేశాడు..



ప్రతినెలా పోస్టాఫీస్‌లో రూ.2000 చొప్పున మూడు సంవత్సరాలు కట్టగా రూ.72 వేలు అయ్యాయి. మరో రూ.28 వేలు ఇస్తే లక్ష రూపాయలు బాండు చేస్తానని చెప్పటంతో ఏడాది కిందట రూ.28 వేలు ఇచ్చాను. రూ.28 వేలు పోస్టాఫీసులో కట్టలేదు. అలాగే 11 నెలలుగా నెలకు రూ.1000 చొప్పున కడుతుండగా పుస్తకం ఇచ్చి ముద్ర వేసి ఇస్తున్నాడు. తీరా చూస్తే అది నకిలీ పుస్తకమని ఉన్నతాధికారులు చెబుతున్నారు.

– కుంచపు వీరమ్మ, పూనూరు

మనవరాలి పెళ్లికని కడితే ..



నా మనవరాలి పెళ్లికి ఉపయోగపడుతుందని పోస్టాఫీస్‌లో 19 నెలలుగా సుకన్య సమృద్ధి యోజన పథకం కింద నెలకు రూ.1000 చొప్పున కడుతూ ఉన్నాను. తీరా అధికారులు పరిశీలించి నీ మనవరాలి పేరున ఖాతానే లేదని చెప్పారు. కూలీనాలి చేసకొని పోస్టాఫీస్‌లో నా పేరున కూడా డబ్బులు కడుతున్నాను. అది కూడా పోస్ట్‌మాస్టర్ సక్రమంగా కట్టకుండా మోసం చేశాడు.

– వల్లపు తిరుపతమ్మ, పూనూరు

నేడు ఖాజీపాలెంలో జాబ్‌మేళా

ఖాజీపాలెం(కర్లపాలెం): గ్రామంలోని కేవీఆర్, ఎంకేఆర్ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి పి.ప్రణయ్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శివప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జాబ్‌మేళాకు టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, డిప్లొమా, ఫార్మసీ చదువుకున్న 18 నుంచి 30 సంవత్సరాలలోపు వయస్సు కలిగిన నిరుద్యోగ యువతీయువకులు వారి బయోడేటాతో హాజరుకావాలని అన్నారు. వివరాలకు నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి పి.ప్రణయ్ నంబర్ 9640695229ను సంప్రదించాలని తెలిపారు.

పొలాల్లో అస్థిపంజరం లభ్యం



తెనాలి రూరల్: పొలాల్లో అస్థిపంజరాన్ని స్థానికులు సోమవారం గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. తెనాలి నుంచి బుర్రిపాలెం వెళ్లే రోడ్డులో నేలపాడు పంచాయతి పరిధిలోని ఓ ప్రైవేటు పాఠశాలకు తూర్పు వైపున ఉన్న పొలంలో అస్థిపంజరాన్ని గుర్తించారు. పోలీసుల ఘటనాస్థలాన్ని పరిశీలించారు. ఎముకల గూడు పక్కన గళ్ల లుంగీ ఉంది. ఇదే పాఠశాల సమీపంలో బిచ్చగాడు నెల రోజులుగా కనబడకుండాపోయాడని, అతని అస్థిపంజరం అయి ఉంటుందని స్థానికులు భావిస్తున్నారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెడ్‌క్రాస్ జిల్లా నూతన కమిటీ ఎన్నిక

నరసరావుపేట: పల్నాడు జిల్లా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ నూతన కమిటీ ఏర్పాటైంది. సోమవారం కలెక్టరేట్‌లో డీఆర్‌ఓ ఏకా మురళి అధ్యక్షతన నిర్వహించిన సాధారణ సమావేశంలో చైర్మన్‌గా మేదరమెట్ల రామశేషగిరిరావు, వైస్ చైర్మన్‌గా కేఎంఎస్‌వీ శ్రీనివాసగుప్తా, కోశాధికారిగా డాక్టర్ నంద్యాల రాంప్రసాదరెడ్డిలను నియమించారు. మేనేజింగ్ కమిటీ సభ్యులుగా పూర్వ అధ్యక్షులు డాక్టర్ కంజుల జగన్‌మోహన్‌రెడ్డి, డాక్టర్ ఎస్.రాంప్రసాద్, డాక్టర్ సృజన, బత్తుల మురళి, బీవీఎల్ ప్రసాద్, పి.నరసింహారావు, విన్సెంట్‌పాల్, భుజంగరావు నియమితులయ్యారు. పరిశీలకులుగా ఏపీ స్టేట్ కోశాధికారి రామచంద్రరాజు వ్యవహరించారు. నూతనంగా ఎన్నికైన సభ్యుల చేత డీఆర్‌ఓ ప్రతిజ్ఞ చేయించారు. గత మూడేళ్లలో జరిగిన సేవా కార్యక్రమాలు, ఫైనాన్షియల్ నివేదికను సమర్పించారు. డాక్టర్ కంజుల జగన్‌మోహన్‌రెడ్డిని సన్మానించారు.

సంక్షేమ పథకాలు కోరుతూ ఆందోళన



బాపట్లలో ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు



ఆందోళనలో పాల్గొన్న మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు

బాపట్ల: అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులనే పదాన్ని తొలగించి వారికి వేతనాలు పెంపుదల చేయాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) బాపట్ల జిల్లా ప్రధాన కార్యదర్శి పి.రేఖ ఎలిజబెత్, జిల్లా అధ్యక్షురాలు కె.ఝాన్సీ డిమాండ్ చేశారు. సోమవారం ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు ధర్నా నిర్వహించారు. యూనియన్ నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీలకు తల్లి వందనం అమలుచేయకుండా మోసం చేసిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే అంగన్‌వాడీలకు వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చి ఇప్పుడు నోరు మెదపకపోవడం వల్ల అంగన్‌వాడీలకు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అంగన్‌వాడీల సమస్యల పట్ల ప్రభుత్వం సానుకూలంగా స్పందించపోతే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సీఐటీయూ బాపట్ల జిల్లా అధ్యక్షులు సీహెచ్.మణిలాల్, ప్రధాన కార్యదర్శి సీహెచ్.మంజూదార్‌లు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చిరు కార్మికులు సమస్యల పరిష్కారం కోసం చొరవ చూపడం లేదన్నారు. సమస్యలు పరిష్కారం చేయకపోతే గత ప్రభుత్వాలకు పట్టినగతే పడుతుందన్నారు. అనంతరం జిల్లా అధికారులకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా నాయకులు కే శరత్, శైలశ్రీ, అనిత, వై.మేరీమణి, బ్యూలా, ఎస్.కృష్ణకుమారి, డి.జ్యోతి, బుచ్చిరాజు పాల్గొన్నారు.

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలి

బాపట్ల: మున్సిపాలిటీలో పనిచేస్తున్న ఇంజినీరింగ్ కార్మికులకు సంక్షేమ పథకాల అమలు చేయాలని కోరుతూ సోమవారం బాపట్లలోని కలెక్టరేట్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ ధర్నా చేశారు. యూనియన్ జిల్లా కన్వీనర్ వీరాస్వామి మాట్లాడుతూ మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం పక్షపాత వైఖరిని అవలంభిసోందని, మునిసిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు ఏ ఒక్క సంక్షేమ పథకం అమలు కావట్లేదన్నారు. కేవలం రూ.12వేల నుంచి రూ.15వేలు మాత్రమే వీరి వేతనాలు ఉన్నాయన్నారు. మునిసిపల్ ఇంజినీరింగ్ కార్మికులందరికీ సంక్షేమ పథకాలు అమలు చేసి జీవో నెంబర్ 36 ప్రకారం వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ సెల్‌లో డీఆర్వోకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ మజుందార్, కే శరత్, మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల యూనియన్ నాయకులు కోటేశ్వరరావు, ప్రమీల, మురళి, రత్నం, అంకారావు పాల్గొన్నారు.

టోల్‌గేట్ వద్ద గంజాయి పట్టివేత

మంగళగిరి: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో కాజ టోల్ గేట్ వద్ద భారీగా గంజాయి, మెత్ డ్రగ్స్‌ను ఈగల్ టీమ్ పోలీసులు సోమవారం పట్టుకున్నారు. బెంగుళూరు నుంచి వైజాగ్‌కు బస్సులో వెళుతున్న యువకుడు భారీగా గంజాయి తరలిస్తున్నారనే సమాచారం మేరకు ఈగల్ టీమ్ సోమవారం కాజ టోల్ గేట్ వద్ద నిఘా వేసింది. గంజాయి తరలిస్తున్న యువకుడిని అదుపులోకి తీసుకుంది. అతని వద్ద నుంచి భారీ మొత్తంలో గంజాయితో పాటు రూ.3 లక్షల విలువైన మెత్‌ను స్వాధీనం చేసుకుంది. యువకుడిని మంగళగిరి రూరల్ పోలీసులకు అప్పగించింది. గంజాయి, మెత్ అక్రమ రవాణా వెనుక ఎవరున్నారు..ఎంత మంది ఉన్నారనే ? అంశాలపై విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కన్నతల్లి ‘అమ్మా’నుషం

తాడేపల్లి రూరల్ : వ్యభిచారంలోకి దించిన కన్నతల్లిపై మైనర్ కూతురు తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేసింది. కృష్ణా జిల్లా కూచిపూడి గ్రామానికి చెందిన ఓ మహిళ భర్త చనిపోయిన తరువాత మరో వ్యక్తితో సహజీనం చేస్తూ వడ్డేశ్వరం వచ్చి నివసిస్తోంది. తన 17 ఏళ్ల కూతురిని కూడా అతనితో ఉండాలంటూ ఒత్తిడి చేయడంతో పాటు వ్యభిచారం వృత్తిలోకి దింపింది. బాలిక పక్కింట్లో నివాసముంటున్న మహిళ సాయంతో తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

బదిలీలను పారదర్శకంగా నిర్వహించాలి

సచివాలయ ఉద్యోగుల వినతి



నగరపాలక సంస్థ అదనపు కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న సచివాలయ ఉద్యోగులు

నెహ్రూనగర్: బదిలీలపై ప్రభుత్వం ఇచ్చిన జీఓ నం.5ను సవరించాలని సచివాలయ ఉద్యోగులు విన్నవించారు. సోమవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యాలయంలో అదనపు కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెబ్ కౌన్సిలింగ్ ద్వారా పారదర్శకంగా బదిలీలు జరపాలని కోరారు. సొంత మండలాల నిబంధనను తీసివేయాలని, అంతర్ జిల్లాల బదిలీలకు అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. సొంత మండలాల ప్రాతిపదికగా కాకుండా అర్బన్ లోకల్ బాడీ(యుఎల్‌బీ)లోని వార్డును తీసుకోవాలని, గ్రామాల్లో పంచాయతీని ప్రాతిపదికగా తీసుకోవాలని కోరారు. ప్రమోషన్‌తో పాటు స్పష్టమైన సర్వీస్ రూల్స్‌ను రూపొందించిన తర్వాతనే బదిలీలు చేపట్టాలని విన్నవించారు. మిగులు ఉద్యోగులను సీనియారిటీ ఆధారంగా వివిధ శాఖల్లోనికి బదిలీ చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో గుంటూరు వార్డు సచివాలయాల అసోసియేషన్ నాయకులు అబ్దుల్ రజాక్, ధనలక్ష్మి, అనురాధ, మధు, రామకృష్ణ, రాజకుమార్ పాల్గొన్నారు.

అండర్-14 టెన్నిస్ విజేత విన్సెంట్



అండర్-14 విజేతలు

గుంటూరువెస్ట్ (క్రీడలు): గ్లోబల్ స్పోర్ట్స్ ఫౌండేషన్, వీవీవీ హెల్త్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక జేకేసీ కళాశాల రోడ్డులో సోమవారం జరిగిన అండర్-14 టెన్నిస్ పోటీల్లో మిక్స్‌డ్ సింగిల్స్ విజేతగా కె.విన్సెంట్, రన్నర్‌గా జి.దిశాంత్ నిలిచారు. డబుల్స్ విభాగంలో దిశ, విన్సెంట్ జోడీ విన్నర్‌గానూ జి.దిశాంత్, కల్యాణీలు రన్నర్స్‌గా నిలిచారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో విజేతలకు ఆపిల్ డెంటల్ కేర్ అధినేత డాక్టర్ హనుమంతరావు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో వీవీవీ హెల్త్ క్లబ్ డెరెక్టర్ హరికృష్ణ, మధుస్మిత, గ్లోబల్ స్పోర్ట్స్ ఫౌండేషన్ కార్యదర్శి జీవీఎస్ ప్రసాద్, ఆనంద్ కుమార్, అరుణ్ కుమార్, చరణ్ పాల్గొన్నారు.

‘ఫలక్‌నుమా’లో ఆరుగురు బాల కార్మికులు గుర్తింపు



పోలీసులకు పట్టుబడిన బాల కార్మికులు

రాజుపాలెం: నడికూడి గవర్నమెంట్ రైల్వే పోలీసు, గుంటూరు ఆర్‌పీఎఫ్, బచపన్ బచావో ఆందోళన్ స్వచ్ఛంద సంస్థలు సంయుక్తంగా హౌరా నుంచి సికింద్రాబాద్ వెళ్లే ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్‌లో గుంటూరు నుంచి పిడుగురాళ్ల వరకు ట్రైన్‌లో రిస్క్ ఆపరేషన్ నిర్వహించగా.. ఇతర రాష్ట్రాలకు చెందిన ఆరుగురు బాలురను గుర్తించి వారి వివరాలను సేకరించారు. వీరిని ఇతర ప్రాంతాలకు బాల కార్మికులుగా పనిచేయించేందుకు తీసుకెళుతున్నట్లు తెలిసింది. వారివారి గ్రామాలకు పంపించే వరకు మండలంలోని కొండమోడు పరిధిలో గల వీరమ్మ కాలనీలోని అనాథ పిల్లల ఆశ్రమం నిర్వాహకులు గరికపాటి శంకరరావుకు ఆదివారం రాత్రి స్థానిక ఎస్‌ఐ వేణుగోపాల్ సహకారంతో అప్పగించారు. ఈ బాలురు జార్ఖండ్, బిహార్, వెస్ట్ బెంగాల్‌కు చెందిన వారిగా గుర్తించారు. వారి తల్లిదండ్రులకు అప్పగించే వారకు జాగ్రత్తగా చూసుకోవాలని ఆశ్రమ నిర్వాహకులకు సూచించారు.

తప్పుడు విధానాలు అమలు చేస్తున్న కూటమి ప్రభుత్వం

సత్తెనపల్లి: ప్రజలకు సూపరిపాలన అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం తప్పుడు విధానాలను అమలు చేస్తుందనిసీపీఎం కేంద్ర కమిటీ సభ్యురాలు దూళ్ళిపాళ్ల రమాదేవి విమర్శించారు. పల్నాడు జిల్లా ముప్పాళ్ళ మండలం మాదల గ్రామంలో రమాదేవి ఆధ్వర్యంలో సీపీఎం బృందం సోమవారం పర్యటించింది. అనంతరం సత్తెనపల్లి పుతుంబాక భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో రేషన్ బియ్యం అక్రమ రవాణా కొనసాగుతూనే ఉందన్నారు. రేషన్ బియ్యం అక్రమ రవాణాను అరికట్టాలనే చిత్తశుద్ధి ప్రభుత్వానికి ఉంటే పేదలందరికీ రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం ఇచ్చి అక్రమ రవాణా అరికట్టవచ్చునన్నారు. రేషన్ షాపుల వద్దకు వెళ్లి బియ్యం తీసుకోవాలంటే ప్రజలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఇంటి వద్దకే రేషన్ బియ్యం వాహనాలను పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారన్నారు. 1 నుంచి 5 తరగతుల వరకు ఉన్న ఎలిమెంటరీ స్కూల్ నుంచి 3,4,5 తరగతులను విడదీసి దూరంగా ఉన్న హైస్కూల్‌కు తరలించడంతో పిల్లల తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉపాధి హామీ కూలీల వేతనాలు 3,4 నెలల పాటు పెండింగ్‌లో పెడుతున్నారని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి వెంటనే పెండింగ్ వేతనాలు వారి అకౌంట్లో జమ చేయాలని ఆమె డిమాండ్ చేశారు. ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఇటీవల మాట్లాడుతూ హిందూ మతాన్ని విమర్శిస్తున్న వారి సంగతి తేలుస్తానని అనడం సరికాదన్నారు. దేవుళ్లను, మతాలను రక్షించడానికి పవన్ కళ్యాణ్ రాజకీయాలకు వచ్చారా? లేదా ప్రజల సమస్యలను పరిష్కరించడానికి వచ్చారా? అని ఆమె ప్రశ్నించారు. సీపీఎం పల్నాడు జిల్లా కమిటీ సభ్యురాలు గుంటూరు మల్లేశ్వరి, సీపీఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్, పట్టణ కార్యదర్శి డి.విమల తదితరులు పాల్గొన్నారు.

27న క్రోసూరులో జాబ్‌మేళా

క్రోసూరు: డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కిల్స్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో క్రోసూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 27న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ బి.వి.రమాదేవి సోమవారం తెలిపారు. ఈ జాబ్‌డ్రైవ్‌ను పెదకూరపాడు నియోజకవర్గ నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జాబ్ మేళాలో సుమారు 10 కంపెనీలు పాల్గొంటున్నాయన్నారు. జీతం విద్యార్హతను బట్టి సుమారు రూ.12000 - రూ.35,000 ఉంటుందని తెలిపారు. ఈ జాబ్ డ్రైవ్‌కు టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, బీటెక్, డిప్లొమా, ఫార్మసీ, పీజీ చదువుకుని, 18-40 మధ్య వయసు గల నిరుద్యోగ యువతి యువకులు వారి బయోడేటా, ఎడ్యుకేషన్ సర్టిఫికేట్స్ జిరాక్స్, ఆధార్ నకలు, పాస్‌పోర్ట్ ఫొటోతో నేరుగా ఇంటర్వ్యూకు హాజరు కావచ్చునన్నారు. మరిన్ని వివరాలకు 7779858789, 8074393466 నంబర్లలో సంప్రదించాలన్నారు.

రైలు నుంచి జారిపడి ప్రయాణికుడు మృతి



దాచేపల్లి: రైలు నుంచి జారిపడి ప్రయాణికుడు మృతి చెందిన సంఘటన సోమవారం తెల్లవారుజామున జరిగింది. లింగంపల్లి నుంచి నర్సాపూర్ వెళుతున్న నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్ రైలు నుంచి గుర్తు తెలియని ప్రయాణికుడు జారిపడి మృతి చెందినట్లు రైల్వే జీఆర్పీ పోలీసులు తెలిపారు. నర్సాపూర్ రైలు నడికుడి రైల్వే స్టేషన్‌కు చేరుకునే సమయంలో జనరల్ కోచ్‌లో ప్రయాణిస్తున్న ప్రయాణీకుడు రైలు వాకిట్లో కూర్చొని నిద్రపోతూ ప్రమాద వశాత్తూ జారి కిందపడటంతో బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడన్నారు. మృతుడి వయస్సు సుమారుగా 25 నుంచి 35 సంవత్సరాల మధ్య ఉంటుందని, మృతుడు ఇటుక రంగు పైన ఎరుపు, తెలుపు, నలుపు చెక్స్ బారుచేతుల చొక్కా, బ్లూ రంగు జీన్స్ ప్యాంట్ ధరించాడన్నారు. మృతదేహాన్ని గురజాల ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీకి తరలించామని, పూర్తి వివరాలకు నడికుడి రైల్వే పోలీసులను సంప్రదించాలని ఎస్ వి.శ్రీనివాసరావు నాయక్ తెలిపారు. వివరాలకు 8074274484, 9949063960 ఫోన్ నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

ఉరివేసుకుని యువకుడి బలవన్మరణం



చిలకలూరిపేట టౌన్: పట్టణంలోని టిడ్కో గృహాల్లో విషాదం చోటు చేసుకుంది. 52 ఎకరాల టిడ్కో గృహాల్లో నివసిస్తున్న యువకుడు దేవగిరి తేజారెడ్డి (28) ఆదివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఫ్యానుకు లుంగీతో ఉరివేసుకుని తన స్నేహితుడి నివాసంలో జీవితం ముగించుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తేజారెడ్డి పర్చూరు మండలం అన్నవరం గ్రామానికి చెందినవాడు. చిన్నతనంలోనే తల్లి మృతిచెందగా, తండ్రి రెండో వివాహం చేసుకుని వేరుగా నివసిస్తున్నాడు. ఈ నేపథ్యంలో తేజారెడ్డిని నాయనమ్మ పెంచింది. అయితే కొంతకాలం కిందట ఆమె మృతిచెందడంతో అతను పూర్తిగా ఒంటరివాడయ్యాడు. పెయింటింగ్ పనులు చేస్తూ జీవనం సాగించిన తేజారెడ్డి మానసికంగా ఒత్తిడికి గురైనప్పుడల్లా టిడ్కో గృహంలో ఉన్న తన స్నేహితుడి వద్దకు వచ్చి ఒకటి రెండు రోజులు ఉండి వెళ్లిపోతాడు. ఇదే విధంగా ఆదివారం స్నేహితుడి ఇంటికి రావడంతో సాయంత్రం 4 గంటలకు మిత్రుడు పనిమీద బయటకు వెళ్లాడు. రాత్రి తిరిగి వచ్చి గది తలుపులు తీయగా తేజారెడ్డి ఉరివేసుకుని కనిపించాడు. వెంటనే పోలీసులకు, గుంటూరు మండలం అంకిరెడ్డిపాలెంలో ఉంటున్న అమ్మమ్మకు సమాచారం అందించడంతో ఆమె పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో అర్బన్ సీఐ పి.రమేష్ సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు.

28న తెనాలిలో మానవ హక్కుల పరిరక్షణ సదస్సు

– ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పేరుపోగు వెంకటేశ్వరరావు



సదస్సు కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

గాంధీనగర్(విజయవాడ సెంట్రల్): తెనాలి పోలీసుల అరాచకత్వాన్ని, మానవ హక్కుల ఉల్లంఘనను నిరసిస్తూ తెనాలి పట్టణంలో జూన్ 28న సాయంత్రం 4 గంటలకు మానవ హక్కుల పరిరక్షణ సదస్సు నిర్వహిస్తున్నట్లు ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పేరుపోగు వెంకటేశ్వరరావు తెలిపారు. విజయవాడ గాంధీనగర్ ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో సోమవారం పరిరక్షణ సదస్సు కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాదిగ మాట్లాడుతూ తెనాలి పోలీసులు దళిత మైనారిటీ యువకులపై అక్రమ కేసులు పెట్టి పోలీస్ స్టేషన్‌లో, బహిరంగ ప్రదేశాల్లో అరికాళ్లపై లాఠీలు విరిగేటట్లుగా అమానుషంగా దాడి చేసిన సంఘటనపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో జ్యుడీషియల్ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనకు బాధ్యులైన సీఐ రాముల నాయక్, తెనాలి త్రీ టౌన్ సీఐ రమేష్ బాబులతో పాటు కానిస్టేబుల్‌పై కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని కోరారు. దళిత యువకులపై నడిరోడ్డుపై థర్డ్ డిగ్రీ ప్రయోగించడాన్ని సమర్థించి వత్తాసు పలికిన గుంటూరు ఎస్పీ సతీష్ కుమార్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. మానవ హక్కుల పరిరక్షణ సదస్సులో ఎమ్మార్పీఎస్, మాల మహానాడు, కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి, దళిత బహుజన ఫ్రంట్, ప్రజాస్వామిక వాదులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. సమావేశంలో మాల మహానాడు అధ్యక్షుడు తుమ్మల ఫ్రాన్సిస్, కులవివక్ష వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంధ్ర మాల్యాద్రి, దళిత బహుజన ఫ్రంట్ జాతీయ అధ్యక్షుడు కొరివి వినయ్ కుమార్, రెల్లి సంఘం అధ్యక్షుడు ఎర్రంశెట్టి ప్రసాద్ పాల్గొన్నారు.

సమ్మెలోకి అవుట్ సోర్సింగ్ కార్మికులు



నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న అవుట్ సోర్సింగ్ కార్మికులు

నెహ్రూనగర్: రాష్ట్ర వ్యాప్తంగా నగరపాలక సంస్థల్లో పనిచేస్తున్న ఇంజినీరింగ్ విభాగ అవుట్ సోర్సింగ్ కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం ఆదివారం రాత్రి నుంచి సమ్మెలోకి వెళ్లారు. నగరపాలక సంస్థ కార్యాలయం ముందు సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఐక్య కార్యాచరణ కమిటీ చైర్మన్ ఈదులమూడి మధుబాబు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం కార్మికులు, కార్మిక సంఘాలు ఐక్య కార్యాచరణ కమిటీగా ఏర్పడి ఈనెల 9న కమిషనర్‌కు సమ్మె నోటీస్ ఇచ్చినా స్పందించలేదని విమర్శించారు. కార్మికులకు జీతాలు పెంచమని పలుమార్లు వినతి పత్రాలు ఇచ్చినా పట్టించుకోలేదని తెలిపారు. విధి లేని పరిస్థితుల్లో సమ్మె చేస్తున్నట్లు మధుబాబు తెలిపారు. గత ప్రభుత్వం పారిశుద్ధ్యం, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కార్మికులకు, డ్రైవర్లకు అప్పుడున్న జీతంపై రూ.6000 అదనంగా పెంచుతూ ఉత్తర్వులు ఇచ్చిందని పేర్కొన్నారు. ఇంజినీరింగ్ విభాగంలో పనులు చేసే కార్మికులకు కమిటీ వేసి దాని సిఫార్సు మేరకు జీతాలు పెంచుతామని హామీ ఇచ్చిందని తెలిపారు. ఈనెల రెండో తేదీన జరిగిన జాయింట్ మీటింగ్‌లో ఈ విషయాన్ని మంత్రి నారాయణ దృష్టికి తీసుకెళ్లగా ముఖ్యమంత్రితో మాట్లాడి చెప్తామని చెప్పి, ఇంత వరకు స్పష్టత ఇవ్వలేదని వివరించారు. రిటైర్‌మెంటు వయసును 60 నుంచి 62 సంవత్సరాలకు పెంచాలని, ఉద్యోగ విరమణ చేసిన కార్మికులకు వెంటనే గ్రాట్యుటీ చెల్లించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికులందరినీ హెచ్‌ఆర్ పాలసీ పరిధిలోకి లేదా మినిమం టైమ్ స్కేల్ ఇవ్వాలని కోరారు. సీనియార్టీ ప్రకారం సంవత్సరానికి ఆరు పర్సెంట్ ఇంక్రిమెంట్ ఇస్తూ జీతాలు చెల్లించాలని లేనిపక్షంలో సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ గుంటూరు నగరపాలక సంస్థ కమిటీ ప్రధాన కార్యదర్శి రాయపూడి కోటి బాబు, కోశాధికారి నాగిపోగు సుమన్, కార్యనిర్వాహక అధ్యక్షుడు గాలి ఏసుబాబు, సంయుక్త కార్యదర్శి వేపూరి రవిశంకర్ పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీలో సీట్లకు 89 మంది విద్యార్థుల ఎంపిక



రోషిణి

గుంటూరు ఎడ్యుకేషన్: రాజీవ్‌గాంధీ సాంకేతిక, విజ్ఞాన విశ్వ విద్యాలయాల్లో (ట్రిపుల్ ఐటీ) ప్రవేశాలకు గుంటూరు జిల్లా నుంచి 89 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. 2025-26 విద్యా సంవత్సరానికి సోమవారం ప్రకటించిన జాబితాలో జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి టెన్త్ ఫలితాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులు ఇంటర్మీడియెట్‌తో పాటు బీటెక్‌తో ఆరేళ్ల ప్రోగ్రామ్‌కు అర్హత సాధించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు 94.78 శాతం మేరకు ఉన్నట్లు ప్రవేశాల జాబితాలో పొందుపర్చారు. గుంటూరు జిల్లా నుంచి ట్రిపుల్ ఐటీల వారీగా నూజివీడు-31, ఇడుపులపాయలోని ఆర్కే వ్యాలీ- 16, ఒంగోలు-35, శ్రీకాకుళంలో-7 చొప్పున ఉన్నారు. ఎంపికైన విద్యార్థులు ఆర్‌జీయూకేటీ వెబ్‌సైట్‌తో పాటు ప్రభుత్వ వాట్సాప్ సేవల నంబరు 95523 00009 ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఆయా క్యాంపస్‌లలో ఈనెల 30 నుంచి జూలై 5వ తేదీ వరకు జరగనున్న కౌన్సెలింగ్‌కు విద్యార్థులు హాజరు కావాలి.

■ గుంటూరు చౌత్రా సెంటర్‌లోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని పి.నాగసాయి రోషిణి నూజివీడు ట్రిపుల్ ఐటీలో సీటు సాధించింది. ఇటీవల విడుదలైన టెన్త్ ఫలితాల్లో అత్యధికంగా 573 మార్కులు సాధించడం ద్వారా ప్రవేశం పొందిన ఆమెను డీఈవో సీవీ రేణుక, ఉర్దూ డీఐ షేక్ ఎండీ ఖాసిం, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వి.పద్మజ అభినందించారు.

వరి విత్తనాలు సిద్ధంగా ఉంచాలి

పల్నాడు జిల్లా వ్యవసాయ అధికారి మురళి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి మురళి

నరసరావుపేట రూరల్: ఖరీఫ్ సీజన్‌లో జిల్లాకు సరిపడా వరి విత్తనాలు డీలర్ల వద్ద అందుబాటులో ఉంచాలని జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళి సూచించారు. నరసరావుపేట సహాయ వ్యవసాయ సంచాలకుల కార్యాలయంలో సోమవారం నరసరావుపేట, రొంపిచర్ల, నకరికల్లు మండలాల పరిధిలోని వరి విత్తన డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ ఈ ఏడాది ఖరీఫ్‌లో జిల్లాలో 53,650 హెక్టార్లలో వరి సాగవుతుందని అంచనా వేస్తున్నట్టు తెలిపారు. ఇందుకోసం 26,825 క్వింటాళ్ల వరి విత్తనం అవసరం అవుతుందని తెలిపారు. ఈ అంచనాల మేరకు బీపీ, జేజీఎల్, కేఎన్ఎమ్, ఎన్ఎల్ఆర్, అంకుర్ సోనా, హెచ్ఎంటీ, బీపీటీ రకాలను డీలర్ల వద్ద అందుబాటులో ఉంచి అవసరం మేర సకాలంలో సరఫరా చేయాలని ఆదేశించారు. విత్తన దుకాణాదారులు ఎమ్మార్పీకి మించి విక్రయిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు విత్తనాలను అధీకృత డీలర్ల వద్దనే కొనుగోలు చేయాలని తెలిపారు. విత్తనాలు కొనుగోలు సమయంలో బిల్లు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. ఏడీఏ మస్తానమ్మ, ఏఓలు శాంతి, పి.శివలలిత, వ్యవసాయ విస్తరణ అధికారి బ్రహ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.